క్లుప్తంగా

స్పార్క్ చైర్మన్ సాయిసందీప్‌కు సన్మానం



సాయిసందీప్‌ను సన్మానిస్తున్న వైస్ చాన్సలర్ రెమి రజనీ

ఏలేశ్వరం: శ్రీకాకుళం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో స్పార్క్ సంస్థ చైర్మన్ సాయిసందీప్‌ను గురువారం ఘనంగా సన్మానించారు. విశ్వవిద్యాలయం నిర్వహించిన సైబర్ బూట్ క్యాంప్, డిజిటల్ సెక్యూరిటీ సదస్సుకు సాయిసందీప్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సదస్సులో రియల్ టైం ఎక్స్‌పీరియన్స్ హ్యాకింగ్‌పై ప్రాక్టికల్‌గా విద్యార్థులకు సాయిసందీప్ వివరించారు. అనంతరం విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ రెమి రజనీ ఆయనకు శాలువా, జ్ఞాపికతో సన్మానించారు.

పర్యాటక కేంద్రంగా లోవ దేవస్థానం అభివృద్ధి

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారి దేవస్థానాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని మాజీ మంత్రి, శాసన మండలిలో టీడీపీ పక్ష నాయకుడు యనమల రామకృష్ణుడు అన్నారు. గురువారం లోవ దేవస్థానం ఈఓ పి.విశ్వనాథరాజు ఆధ్వర్యంలో జరుగుతున్న శరన్నవరాత్రి మహోత్సవాలకు యనమల ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత మాస్టర్ ప్లాన్ రూపొందిస్తామన్నారు. చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, మాజీ చైర్మన్లు పాల్గొన్నారు.

జగపతినగరం జలమయం



ముంపులో ఉన్న జగపతినగరం ప్రధాన రహదారి

కిర్లంపూడి: మండలంలో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షంతో జగపతినగరంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎగువ ప్రాంతాల నుంచి ముంపు నీరు భారీగా రోడ్డుపైకి చేరడంతో గురువారం ఉదయం ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తూముల్లో చెత్తచెదారం చిక్కుకుపోడంతో, ముంపు నీరు ముందుకు పారలేదు. ప్రధాన రహదారిపై నీరుచేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నరసయ్యపేట, శెట్టిబలిజపేట వీధుల్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ముంపు నీరు వీధుల్లోనే నిలిచిపోయింది. గ్రామంలో ఓ వ్యక్తి మృతదేహానికి అంత్యక్రియలు చేసేందుకు శ్మశానానికి తీసుకువెళ్లటానికి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గత్యంతరం లేకపోవడంతో ముంపు నీటిలోంచి మృతదేహాన్ని గ్రామస్తులు శ్మశానానికి తీసుకువెళ్లారు.

ముంపుతో తంటా..

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పలు ప్రభుత్వ కార్యాలయాలు జలమయమయ్యాయి. ప్రత్తిపాడు సీహెచ్‌సీ, సబ్ స్టేషన్, ఫైర్ స్టేషన్లు కూడా నీట మునిగాయి. ఆయా కార్యాలయాల సిబ్బంది భయాందోళనలకు గురయ్యారు. అగ్నిమాపక సిబ్బంది మోటార్ల సాయంతో నీటిని తోడారు.

మైనింగ్ మాఫియాను నియంత్రించాలి

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని వంతాడ లేటరైట్ మైనింగ్ యార్డ్ వద్ద మైనింగ్ మాఫియా ఆగడాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ రౌతుపాలెం గ్రామస్తులు గురువారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు మైనింగ్ యార్డ్ వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ మైనింగ్ ప్రాంతంలో రైతులకు చెందిన భూములు అన్యాక్రాంతానికి గురవుతున్నాయని విమర్శించారు. మైనింగ్ రవాణా వల్ల రోడ్లు ధ్వంసం అవుతున్నాయని, పంట పొలాలు కాలుష్యం బారిన పడుతున్నాయని వాపోయారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఒమ్మంగి, రాచపల్లి పరిసర గ్రామాల్లో శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ జగ్గంపేట ఈఈ వీరభద్రరావు తెలిపారు. ప్రత్తిపాడు నుంచి ఒమ్మంగి వెళ్లే మార్గంలోని విద్యుత్ లైన్‌లో ట్రీ కటింగ్ చేపట్టనున్నట్లు చెప్పారు.

పరిశుభ్రతతో సమాజ శ్రేయస్సు

గండేపల్లి: పరిశుభ్రత సమాజ శ్రేయస్సుకు దోహదపడుతుందని పవర్ గ్రిడ్ డీజీఎం పవన్ కుమార్ అన్నారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా సూరంపాలెంలోని పవర్‌గ్రిడ్ సిబ్బందికి అవగాహన కల్పించారు.

ఎంపీడీఓకు సత్కారం

గోకవరం: రామచంద్రపురానికి బదిలీపై వెళుతున్న ఎంపీడీఓ కె.పద్మజ్యోతిని గురువారం ఎంపీపీ సుంకర శ్రీవల్లి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఆమెతో పాటు బదిలీ అయిన పలువురు సిబ్బందిని ఎంపీపీ శ్రీవల్లి, వీరబాబు దంపతులు సన్మానించారు. పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

సిండికేటుగాళ్లు రెడీ..!

- వ్యాపారుల చేతుల్లో మద్యం విక్రయాలు
- సిండికేట్ల గుప్పిట్లోకి దుకాణాలు
- 11 నుంచి మూతపడనున్న ప్రభుత్వ షాపులు
- ఉపాధి కోల్పోనున్న సూపర్‌వైజర్లు, సేల్స్‌మన్లు



ఈ నెల 12 నుంచి మూతపడనున్న ప్రభుత్వ మద్యం దుకాణం

తుని రూరల్: రాష్ట్రంలో ఈ నెల 12 నుంచి నూతన మద్యం పాలసీ అమల్లోకి వస్తుండడంతో ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుకాణాలు మూతపడనున్నాయి. మద్యం దుకాణాలన్నీ ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లనున్నాయి. లైసెన్సులు దక్కించుకున్న దుకాణదారులు సిండికేట్లుగా ఏర్పడి, విచ్చలవిడి మద్యం విక్రయాలకు పాల్పడే అవకాశం ఉంది. దీంతో మళ్లీ గ్రామాల్లో బెల్టు షాపులు కొనసాగే పరిస్థితులు కనిపిస్తున్నాయి. తుని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సర్కిల్ పరిధిలో తుని పట్టణం, తుని రూరల్, కోటనందూరు, తొండంగి, రౌతులపూడి మండలాలున్నాయి. ఆయా మండలాల పరిధిలో రెండు వందల గ్రామాలు, 30 మున్సిపల్ వార్డులు ఉండగా, మూడున్నర లక్షల మంది ప్రజలు ఉన్నారు. తుని పట్టణం, నాలుగు మండలాల పరిధిలో ప్రభుత్వం ఆధ్వర్యాన 21 మద్యం దుకాణాలున్నాయి. నూతన పాలసీలో తుని మండలంలో ఆరు, తొండంగిలో నాలుగు, కోటనందూరులో రెండు, రౌతులపూడిలో రెండు, తుని పట్టణంలో ఎనిమిది (మొత్తం 22) మద్యం దుకాణాలు ఏర్పాటు కానున్నాయి.

లాటరీ పద్ధతిలో కేటాయింపు

గత సార్వత్రిక ఎన్నికలలో తక్కువ ధరకే మద్యం విక్రయిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన విషయం తెలిసిందే. అందుకు అనుగుణంగా మద్యం దుకాణాలకు బహిరంగ వేలం నిర్వహించకుండా లాటరీ పద్ధతిలో దుకాణదారులను ఎంపిక చేసి, లైసెన్సులు జారీ చేయనున్నారు. వేలం నిర్వహిస్తే ధరలు అదుపులో ఉండవని, నిరీత లైసెన్సు ఫీజులు వసూలు చేస్తే, ముందుగా నిర్ణయించిన ధరలకే మద్యం విక్రయాలు జరుగుతాయనేది ప్రభుత్వ ఆలోచనగా ఉంది. ప్రభుత్వం ఎన్ని ఎత్తుగడలు వేసినా, లాటరీ ద్వారా దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులు సిండికేట్‌గా మారి మద్యం విక్రయాలను విస్తృతం చేసేందుకు బెల్టు షాపులకు తెర తీయనున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడనుంది. సిండికేట్లకు కాసులు వర్షం కురవనుంది.

కల్తీకి ఆస్కారం!

మద్యం దుకాణాల ద్వారా ఆర్జించిన లాభాలతో పాటు, మరింత ఎక్కువ మొత్తంలో ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు కొంతమంది వ్యాపారులు మద్యం కల్తీకి పాల్పడే అవకాశం లేకపోలేదు. తుని నియోజకవర్గంలో ఇటువంటి సంఘటనలు గతంలో జరగడమే ఇందుకు నిదర్శనం. ఫిర్యాదులు అందినప్పుడు సంబంధిత శాఖ ఉన్నతాధికారులు దాడులు చేయగా, మద్యం సీసాల సీల్లు తొలగించి, కల్తీ చేసిన తర్వాత యథాతథంగా సీల్లు వేస్తూ అక్రమార్జనకు పాల్పడిన సంఘటనలున్నాయి. అదేవిధంగా లాభాల కోసం ఇప్పుడూ మద్యం కల్తీకి పాల్పడే అవకాశాలున్నాయని మందుబాబులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధి కోల్పోనున్న సిబ్బంది

ప్రభుత్వ మద్యం దుకాణాలు ఈ నెల 11తో మూతపడుతుండడంతో నాలుగేళ్లకు పైగా ఆయా షాపుల్లో పని చేస్తూ, ఉపాధి పొందుతున్న సూపర్‌వైజర్లు, సెల్స్‌మన్లు, కాపలాదారులు (వాచ్‌మన్లు) ఉపాధి కోల్పోనున్నారు. ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని వారు ఆందోళన చేసినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీంతో తుని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సర్కిల్ కార్యాలయం పరిధిలో 70 మందికిపైగా ఉపాధి కోల్పోనున్నారు.

> **ఆదేశాలు అమలు చేస్తాం**
>
> ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మద్యం దుకాణాలు ఈ నెల 11 వరకు కొనసాగుతాయి. లైసెన్సుల జారీలో ఏమైనా జాప్యం జరిగితే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. సారా, బెల్టు దుకాణాల అదుపునకు మా శాఖ ప్రత్యేక దృష్టి, నిఘా ఉంటుంది.
>
> – చిట్టిబాబు, ఇన్‌చార్జి సీఐ, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్, తుని సర్కిల్

ఆధునిక పద్ధతులతో సాగులో సత్ఫలితాలు

కోటనందూరు: వరిసాగులో ఆధునిక పద్ధతులు పాటించడం ద్వారా సత్ఫలితాలు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్ అన్నారు. కోటనందూరు, కాకరాపల్లి గ్రామాల్లో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా వరిసాగులో మార్పులు తీసుకురావాలన్నారు. ఆధునిక యాంత్రీకరణతో తక్కువ పెట్టుబడితో మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పట్టు పరిశ్రమ శాఖ అధికారి ముసలయ్య, ఏఈఓ కేవీ శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

శంఖవరం: పంట సాగులో మోతాదుకు మించి ఎరువులు వాడరాదని వ్యవసాయ సహాయ సంచాలకుడు ఎస్ బుల్లిబాబు అన్నారు. కత్తిపూడి, సీతంపేట గ్రామాల్లో ఏఓ పి.గాంధీ ఆధ్వర్యంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని బుల్లిబాబు తెలిపారు.

తుని రూరల్: రైతులకు ఈ–పంట నమోదు, ఈ–కేవైసీపై పూర్తి అవగాహన ఉండాలని మండల వ్యవసాయాధికారి బి.అశోక్‌కుమార్ అన్నారు. తుని మండలంలోని దొండవాక, తాళ్లూరు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ–పంట నమోదుతో పంట బీమా, పంట విక్రయం, ఇన్‌పుట్ సబ్సిడీ, యంత్రాల రాయితీలు లభిస్తాయని వివరించారు. సంప్రదాయ పంటల స్థానే వాణిజ్య, పండ్ల తోటల పెంపకంపై రైతులు దృష్టి సారించాలని ఉద్యాన అధికారి జి.విజయలక్ష్మి సూచించారు. ఇందుకు ఉద్యాన శాఖ పలు రాయితీలు అందిస్తోందన్నారు. రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రత్నగిరిపై దసరా ఉత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో కనకదుర్గ అమ్మవారి ఆలయం



ఉత్సవాల సందర్భంగా పారాయణలు, పూజలు చేస్తున్న రుత్విక్కులు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరంలోని శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో దసరా ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రత్నగిరి దుర్గామాతలు వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లను బాలా త్రిపుర సుందరి మాతలుగా అలంకరించి పూజించారు. సత్యదేవుని ఆలయంతో పాటు అమ్మవార్ల ఆలయాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. సత్యదేవుడు, అమ్మవారు, దుర్గా మాతకు పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి అవతారాలు బాల, సువాసినీగా చిన్నారి, ముత్తయిదువులను అలంకరించి పూజలు చేశారు. ప్రధానార్చకులు ఇంద్రగంటి నర్సింహమూర్తి, కోట సుబ్రహ్మణ్యం, కల్యాణబ్రహ్మ ఛామర్తి కన్నబాబు తదితరుల ఆధ్వర్యంలో రుత్విక్కులు అమ్మవార్లకు కుంకుమపూజలు చేశారు.

అప్రమత్తంగా ఉండండి

తుని రూరల్: దసరా పర్వదినాలకు ఊళ్లు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలని సీఐ సీహెచ్ చెన్నకేశవరావు అన్నారు. గురువారం రూరల్ ఎస్సై బి.కృష్ణామాచారి ఆధ్వర్యంలో ఎస్.అన్నవరం శివారు జగన్నాథగిరిలో చోరీలపై అవగాహన కల్పించారు. సమీప పోలీస్ స్టేషన్లలో సమాచారం ఇచ్చి ఊళ్లకు వెళితే నిఘా ఉంచుతామన్నారు.

సారా బట్టీ ధ్వంసం

జగ్గంపేట: మండలంలోని నరేంద్రపట్నంలో సారా బట్టీని ధ్వంసం చేసినట్టు ఎస్సై టి రఘునాథరావు తెలిపారు. గ్రామ శివారులో సారా బట్టీ నిర్వహిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేశారు. బట్టీని ధ్వంసం చేసి, డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీదారుడిని అదుపులోకి తీసుకుని, పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.

కండక్టర్ సస్పెన్షన్‌ను నిరసిస్తూ ధర్నా



ఏలేశ్వరం ఆర్టీసీ డిపో వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

ఏలేశ్వరం: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో కండక్టర్ అక్రమ సస్పెన్షన్‌ను నిరసిస్తూ గురవారం కార్మికులు ధర్నా చేశారు. ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో డిపో గేటు వద్ద ధర్నా చేసి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంప్లాయీస్ యూనియన్ డిపో కార్యదర్శి యూబీఎం కుమార్ మాట్లాడుతూ ఉద్యోగ భద్రత మార్గదర్శకాలను పాటించకుండా హెడ్డాఫీసు వారు కండక్టర్ ఎస్ఎస్ రావు(నల్ల శ్రీను)ను సస్పెన్షన్ చేయడం దారుణమన్నారు. ఉత్తమ కండక్టర్‌గా సేవలందిస్తున్న శ్రీనును సస్పెన్షన్ చేయడం చట్ట, కార్మిక వ్యతిరేక చర్య అని పేర్కొన్నారు. శ్రీను విధుల్లోకి తీసుకునే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. హెడ్డాఫీసు జారీ చేసిన ఉద్యోగ భద్రత సర్కులర్ 1/2019 కచ్చితంగా అమలు చేయాలన్నారు. కండీషన్‌లో బస్సులను మాత్రమే నడపాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.మాణిక్యం, కె.త్రిమూర్తులు, ఎన్‌పీ రావు, నానిబాబు, చలం తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కబడ్డీ, వాలీబాల్ పోటీలు



కబడ్డీ పోటీలో ఉత్సాహంగా ఆడుతున్న బాలికలు



వాలీబాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారిణులు

తుని: ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులకు సీబీఎస్ఈ క్లస్టర్–7 కబడ్డీ, వాలీబాల్ పోటీలు స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థలో ఉత్సాహభరితంగా జరుగుతున్నాయి. గురువారం అండర్–14, 17, 19 బాలికల విభాగంలో నువ్వా నేనా అన్న రీతిలో క్రీడాకారులు తలపడ్డారు. రెండు రాష్ట్రాలకు చెందిన సుమారు వంద పాఠశాలల నుంచి దాదాపు 1,200 మంది క్రీడాకారులు హాజరయ్యారని విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు. గురువారం సాయంత్రానికి ఆరు కేటగిరీల్లో కబడ్డీ, వాలీబాల్ జట్లు తుది పోరుకు సెమి ఫైనల్స్‌కు చేరినట్టు చెప్పారు. శుక్రవారం జరిగే ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా హాజరై, విజేతలకు బహుమతీ ప్రదానం చేస్తారన్నారు.

గ్రామసభలో ప్రొటోకాల్ ఉల్లంఘన



రాచపల్లి గ్రామ సభలో ప్రొటోకాల్ ఉల్లంఘించి టీడీపీ నేత లోకేష్(వృత్తంలో వ్యక్తి)కు స్థానం కల్పించిన అధికారులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలో రైతులకు వ్యవసాయంలో నూతన పద్ధతులపై అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది గ్రామ సభలను అధికారులు మొక్కుబడి తంతుగా మార్చేశారు. రైతులకు అవగాహన కల్పించడం కన్నా అధికార పార్టీ నేతలను ప్రసన్నం చేసుకోవడమే లక్ష్యంగా గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. ఈ గ్రామ సభల వల్ల తమకు ఒరిగిందేమీ లేదని, పొలాల్లో ఫొటోలు తీసుకుని, కార్యక్రమాన్ని ముగుస్తున్నట్టు రైతులు విమర్శిస్తున్నారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది గ్రామ సభల్లో వైఎస్సార్ సీపీకి చెందిన సర్పంచ్‌లకు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులకు అధికారులు స్థానం కల్పించడం లేదని ప్రజాప్రతినిధులు వాపోతున్నారు. గురువారం రాచపల్లిలో నిర్వహించిన గ్రామ సభలో సర్పంచ్ సారిపల్లి లోవలక్ష్మి, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీనుకు వ్యవసాయ అధికారులు కనీసం సమాచారం ఇవ్వలేదు. దీనిపై స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని వైస్ ఎంపీపీ శ్రీను తెలిపారు. గ్రామ సభల్లో ప్రొటోకాల్ లేని టీడీపీ నేతలకు స్థానం కల్పిస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పార్టీలకతీతంగా అధికారులు ప్రొటోకాల్‌ను పాటించాలని కోరారు.

జగన్మాతా పాహిమాం..


- అంగరంగ వైభవంగా శరన్నవరాత్ర ఉత్సవాలు ఆరంభం
- వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు
- పోటెత్తిన కనకదుర్గ ఆలయాలు
- ఆలయాల వద్ద భారీ ఏర్పాట్లు
- పెద్దఎత్తున భక్తుల ప్రత్యేక పూజలు



బాలా త్రిపుర సుందరీదేవి అవతారంలో జగపతినగరం అభయ దుర్గమ్మ



రాచపల్లిలో బాలాత్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చిన అపిత కుచాంబ అమ్మవారు



వెండి, బంగారు ఆభరణాలతో గోకవరం దేవీచౌక్ కనకదుర్గమ్మ



ప్రత్తిపాడులో కలశాలతో ఊరేగుతున్న మహిళలు

ప్రత్తిపాడు: విజయ దశమిని పురస్కరించుకుని వాడవాడలా శరన్నవరాత్ర ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పలు గ్రామాల్లో దుర్గమాత విగ్రహాలను ప్రతిష్ఠించారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ప్రత్తిపాడు మునసబు గారి రామాలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో, స్థానిక పంచాయతీ సమీపంలోని దుర్గమాత ఆలయంలో కనకదుర్గమ్మ వారి విగ్రహాలను నెలకొల్పారు. ప్రత్తిపాడులోని శ్రీఅన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి వారి పంచాయతన ఆలయంలో ఆలయ ప్రధానార్చకుడు కొత్తలంక సాయిశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. తొలిరోజు అమ్మవారు శ్రీస్వర్ణ కవచాలంకృత దుర్గాదేవిగా పూజలందుకున్నారు. స్థానిక తోటవీధిలోని శ్రీవిజయదుర్గా ఆలయంలోనూ, జాతీయ రహదారిపై ఫారెస్ట్ చెక్‌పోస్టు వద్ద ఉన్న అభయ దుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెదశంకర్లపూడి, టి.రాయవరం, చినశంకర్లపూడి, ఏలూరు తదితర గ్రామాల్లో వేడుకలను ఘనంగా ప్రారంభించారు.

కలశాలతో అమ్మవారి ఊరేగింపు

ప్రత్తిపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శ్రీవిజయదుర్గ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని 108 మంది ముత్తయిదువలు, మహిళలు, భవానీ భక్తులు కలశాలు శిరస్సున ధరించి, పెద్దాపురం నుంచి తీసుకువచ్చిన దుర్గాదేవి విగ్రహాన్ని గ్రామంలోని మెయిన్‌రోడ్డు, పల్లపు వీధి, మునసబు గారి రామాలయం వీధి, తోట వీధి తదితర ప్రధాన వీధుల మీదుగా ఊరేగింపుగా తెచ్చి, విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

ఏలేశ్వరం: శరన్నవరాత్ర వేడుకలు నియోజకవర్గంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయాల వద్ద దుర్గమ్మ అమ్మవారి విగ్రహాలను శాస్త్రోక్తంగా ఏర్పాటు చేశారు. స్థానిక తోటవీధిలో మహిళలు ప్రత్యేకపూజలు చేశారు. లింగవరంకాలనీలో వేడుకలను ప్రారంభించారు. దిబ్బలపాలెం సంతోషి మాత గుడి వద్ద అజిత్ చక్రవర్తి, రంజిత్ చక్రవర్తి దంపతులు ఉత్సవాలు ప్రారంభించారు. లింగంపర్తిలోని సత్రంపంపుకాలనీ, సుబ్బారావుకాలనీ తదితర ప్రాంతాల్లో వేడుకలు ప్రారంభమయ్యాయి.

వైభవోపేతంగా ఉత్సవాలు

తుని రూరల్: మండలంలో శరన్నవరాత్ర మహోత్సవాలు వైభవోపేతంగా మొదలయ్యాయి. కనకదుర్గ అమ్మవారి విగ్రహాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పందిళ్లలో ప్రతిష్ఠించి, ప్రత్యేక పూజలు చేశారు. ఎస్.అన్నవరం, కొత్త సూరవరం, డి.పోలవరం, రేఖవానిపాలెం, కేఓ.మల్లవరం, వి.కొత్తూరు, ఎస్.చామవరం, హంసవరం, రాపాక, తేటగుంట, కొలిమేరు, ఎస్.సూరవరం తదితర గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించి, ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. కొత్త సూరవరం శ్రమదానం రోడ్డులో ప్రతిష్ఠించిన అమ్మవారిని వైఎస్సార్ సీపీ నాయకుడు యనమల కృష్ణుడు, జిల్లా ఉపాధ్యక్షుడు గంటా చక్రరావు, ఎంపీటీసీ సభ్యుడు వంగలపూడి అప్పారావు, మద్రి నానాజీ, మామిడాల అప్పలరాజు, పైలా వెంకటరమణ, రెడ్డి వీరబాబు దర్శించుకున్నారు.

ఆలయాల ముస్తాబు

కిర్లంపూడి: మండలంలో వివిధ గ్రామాల్లో శరన్నవరాత్ర మహోత్సవాల సందర్భంగా దుర్గమ్మ ఆలయాలను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. జగపతినగరంలో ఉన్న అభయ దుర్గమ్మ అమ్మవారిని బాలాత్రిపుర సుందరి అవతారంలో అలంకరించి, ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. వీరవరం, రామచంద్రపురం, చిల్లంగి, బూరుగుపూడి గ్రామాల్లో ఉన్న దుర్గమ్మ ఆలయాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. జగపతినగరం, సోమరాయణంపేటలో ఉన్న దుర్గమ్మ అమ్మవార్లకు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా బోనాల ఉత్సవం

రౌతులపూడి: మండలంలోని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయాల్లో వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రౌతులపూడి సినిమా సెంటర్‌లోని కనకదుర్గ అమ్మవారి ఆలయంలో శ్రీనివాసా వర్తక సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ వీధుల్లో మహిళలు వైభవంగా బోనాల ఉత్సవం కొనసాగించారు. ఎస్.పైడిపాల, బలరామపురం, లచ్చిరెడ్డిపాలెం గ్రామాల్లో అమ్మవారికి బోనాలతో ఊరేగించారు. ములగపూడి, ఎస్ఎస్ పట్నం, ఎస్.అగ్రహారం, గిడజాం, ఎ.మల్లవరం, గ్రామాల్లో అమ్మవారి మహోత్సవాలు జరుగుతున్నాయి.

మహిళల భారీ కలశ యాత్ర

కోటనందూరు: కాకరాపల్లి ఊరచెరువులో వెలిసిన కనకదుర్గమ్మ ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. సుమారు వెయ్యి మంది మహిళలు శిరస్సుపై కలశాలు ధరించి, మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, భారీ బాణసంచా కాల్పులతో గ్రామ వీధుల్లో కలశ యాత్ర నిర్వహించారు. తొలిరోజు కనకదుర్గమ్మ బాలాత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. జగన్నాథపురం, పాతకొట్టాం, బొద్దవరం, భీమవరపుకోట గ్రామాల్లో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

తొండంగి: మండలంలోని ఏ.కొత్తపల్లి, గోపాలపట్నం, శృంగవృక్షం బీసీ కాలనీ, రావికంపాడులో మహిషాసురమర్దిని ఆలయం, దానవాయిపేట, ఒంటిమామిడి, వేమవరం, కొమ్మనాపల్లి, తొండంగి తదితర గ్రామాల్లోని కనకదుర్గమ్మ ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఏ కొత్తపల్లి గొల్లపేటలోని దుర్గామాత ఆలయంలో భవానీ మాలధారులు అన్న సమారాధన నిర్వహించారు.

ప్రత్తిపాడు రూరల్: మండలంలో దేవి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. రాచపల్లి అపిత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి వారి ఆలయం, ధర్మవరం విజయదుర్గ అమ్మవారి ఆలయం, ఒమ్మంగి కనకదుర్గ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గోకవరం దేవీచౌక్‌లో..

గోకవరం: శరన్నవరాత్రి ఉత్సవాలు గోకవరంలో ప్రసిద్ధిగాంచిన దేవీచౌక్ ఆలయంలో ఉదయం కలశస్థాపనతో ప్రారంభమయ్యాయి. తొలిరోజు శ్రీకనకదుర్గమ్మ అమ్మవారు శ్రీబాలాత్రిపుర సుందరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అమ్మవారికి వెండి, బంగారు ఆభరణాలు, గజమాలలతో ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. స్థానిక వీరభద్రునిగడ్డలో, తంటికొండలో వెంకటగిరి కొండపై శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.



ఏలేశ్వరంలో దుర్గాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



కొత్త సూరవరంలో అమ్మవారి సన్నిధిలో యనమల కృష్ణుడు, చక్రరావు తదితరులు



ఎస్.పైడిపాలలో కనకదుర్గ అమ్మవారికి బోనాల ఉత్సవం నిర్వహిస్తున్న మహిళలు